


# ఫారిన్ వెళ్ళాల(న)ండి

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ డ్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (38)*

రావుగారి విశేషాలు మరిన్ని స్మరించేముందు, వాటితో ఎంతోకొంత జతపడ్డ కవిబాబు వ్యక్తిత్వాన్ని పరిచయం చెయ్యాల్సి ఉంది.

***కవిబాబు ముచ్చట్లు***

వీలు దొరికితే ఊళ్లో తిరగడం మాకు మామూలేగా–

ఓసారి అలా తిరుగుతుండగా మాకు ఎదుటపడ్డ ఓ వ్యక్తి మమ్మల్ని చూసి ఆగిపోయి క్షణంపాటు మా నలుగుర్నీ తేరిపార చూశాడు. తర్వాత అతడి చూపులు శ్రీమతిమీద నిలిచి ఆగిపోయాయి.

దాంతో క్షణంపాటు అప్రయత్నంగా మేమూ అగిపోయాం.

అతడంత పరీక్షగా చూస్తుంటే కలిగిన ఇబ్బందినుంచి బయటపడ్డానికి నేనూ అతణ్ణి పరీక్షగా చూశాను.

నాకంటేనూ కాస్త పొట్టిగా ఉన్నాడు. నాకులా కాకుండా పుష్టిగా, బొద్దుగా ఉన్నాడు. హిచ్‌కాక్ సినిమాల్లో పాత్రలా పొడవాటి లాంగ్‌కోటు ధరించాడు. రంగు నలుపుకి దగ్గర. చూడ్డానికి భారతీయుడిలాగే ఉన్నాడు. మాకు పరిచయస్థుడు కాదు.

శ్రీమతికి కొంచెం ఇబ్బందిగా అనిపించి, “పదండి, పోదాం” అంది నాతో నెమ్మదిగా.

మేము ముందుకి వెళ్లబోతుంటే, “అనుకున్నాను, మీరు తెలుగువాళ్లేనని” అన్నాడతడు.

మళ్లీ మా కాళ్లకి బ్రేకులు పడ్డాయి– ఈసారి ఆశ్చర్యంతో!

ఆశ్చర్యానికి కారణం అతడు మమ్మల్ని తెలుగువాళ్లుగా గుర్తించినందుకు కాదు.

బయటివాళ్లకి భారతీయులంతా ఒకటికావచ్చు కానీ– మన కట్టూ బొట్టూ ఎంత విభిన్నమో ఒరిస్సాలో ఉన్నాకనే మాకు అర్థమైంది. ఆడవాళ్ల కట్టూ బొట్టూ చూసి– ఒరియా, బెంగాలీ, పంజాబీ, యూపీ వాళ్లని నిర్ధారించడం అక్కడే మాకు అలవడింది. ఉత్తరాదివాళ్లు కూడా దక్షిణ భారత మహిళల్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళీలని ఇట్టే కనిపెట్టేసేవారు.

మగాళ్ల విషయానికొస్తే, అందరి కట్టూ పాంటూ షర్టూనే అయినా– ఆడవాళ్లు పక్కనున్నప్పుడు వాళ్ల మొహాల్లోనే ఏదో తేడా దొరికేది.

కానీ బెర్లిన్ వచ్చేక ఈ తేడాలు పట్టడం కష్టమయ్యేది.

ఒకటి– కనిపించినవాడు ఇండియనైతే చాలు అనే ధ్యాసలో, ప్రాంతాలు స్ఫురించక పోవడం.

రెండు– చలి వాతావరణంలో మసలడానికి కంఫర్టబులుగా ఉంటుందని, ఆడా మగా కూడా పాంటూ షర్టులే వేసుకోవడం.

వచ్చిన కొత్తలో నేను కూడా శ్రీమతిని దుస్తులు మార్చమని బలవంతపెట్టాను. కానీ, "కంఫర్టు వంటికే కాదు. మనసుకీ ఉండాలి. నేనిక్కడుండేది ఓ ఏడాది పైన. ఆమాత్రానికి మనసునెందుకు ఇబ్బంది పెట్టాలి?" అని నా మాట కొట్టి పారేసిందామె.

ఆమె మనసుకి కలిగే ఇబ్బంది తనతో ఆగేది కాదు. తెలుగు మహిళలు చీర కాకుండా మరే దుస్తులు వేసుకున్నా, ఏదో తప్పు జరిగినట్లు అనిపించేదామెకి. అది సబబా కాదా అన్న విషయాన్ని పక్కన పెడితే– మన సంస్కృతి, సంప్రదాయాల్ని నిలబెడుతున్నది ఎక్కువమంది ఆడవాళ్లలో నెలకొన్న ఇలాంటి మనస్తత్వమేనని ఒప్పుకోక తప్పదు.

మరి వేదికలెక్కి ఉపన్యాసాలు దంచడంవరకే తమ పాత్ర అనుకుంటారు మగాళ్లు!

ఎప్పుడూ చీరలే కడుతూ, నుదుట బొట్టుని మరువకుండా దిద్దుకుంటూ, అత్యవసరమైనప్పుడే తప్ప ఓవర్‌కోటు ధరించకుండా బయట తిరిగే ఆమెను చూడగానే, అపరిచిత భారతీయులు కూడా చటుక్కున, 'తెలుగువాళ్లా?' అనడిగేవారక్కడ.

కాబట్టి ఇప్పుడీ అపరిచితుడు మమ్మల్ని తెలుగువారిగా గుర్తించడంలో ఆశ్చర్యమేంలేదు. ఐనా మేమాశ్చర్యపడ్డామంటే కారణముంది.

మేం చదువుకునే రోజుల్లో హైస్కూల్లో, కాలేజీల్లో తెలుగు టీచర్ల వేషభాషలు ప్రత్యేకంగానూ, మిగతా టీచర్సుకి భిన్నంగానూ ఉండేవి. వ్యక్తిత్వాలు కూడా వేషభాషలకి దీటొచ్చేలా ఉండేవి.

1967లో వైజాగులో కొత్త కాపురంలోనే మేమిద్దరం, మాకిద్దరు. ఆ ఇద్దరూ నా తమ్ముడూ, చెల్లెలూనూ. తమ్ముడు ఎవిఎన్ కాలేజిలో బియ్యేలో చేరితే, చెల్లెలు స్కూలుఫైనల్ చదవడానికి పెదవాల్తేర్లో కెడిపిఎం హైస్కూల్లో చేరింది.

ఒకరోజున నా చెల్లెలు స్కూల్నించి ఇంటికొచ్చి, "అన్నయ్యా! మా తెలుగు మేస్టారు క్లాసుకి పాంటేసుకొచ్చారు. ఎక్కడైనా తెలుగు మేస్టర్లు పాంట్లేసుకుంటారా?" అనడిగింది ఎంతో ఆశ్చర్యంగా.

రాజ్యం పిక్చర్సు వారి శ్రీకృష్ణలీలలు సినిమాలో కృష్ణుడు మన్ను తిన్నాక, గోపబాలుడు (నల్ల రామ్మూర్తి) యశోదకు పితూరీ చెయ్యడానికి వెళ్లి జరిగింది వివరంగా చెప్పడం– అదో మృదుమధుర హాస్యం. కృష్ణుడు భూదేవి తన పెళ్లామని చెప్పినందుకు సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ, 'భూదేవి పెళ్లామేమిటి అత్తయ్యా' అని ఆశ్చర్యపోతాడు. ఇప్పటికీ ఆ సన్నివేశం తలపులోకొస్తే గిలిగింతలు పెడుతుంది.

'తెలుగు మేస్టర్లు పాంటేసుకుంటారా?' అన్న నా చెల్లెలి సందేహంలో అదే అమాయకత్వం, హాస్యం జతపడ్డాయి. అప్పటికి నవ్వుకున్నా- నా చెల్లెలి ఆశ్చర్యం- అప్పటి తెలుగు టీచర్ల వ్యక్తిత్వాలకు యోగ్యతాపత్రమని ఇప్పుడు గ్రహిస్తున్నాం.

వ్యక్తిత్వమంటే వేషభాషలు మాత్రమే కాదు.

వృత్తిపట్ల అంకితభావం, శిష్యులపట్ల బాధ్యత నాటి గురువుల్లో అధికసంఖ్యాకులకు సహజ గుణాలు.

మచ్చుకి నేను రాజమండ్రి గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజిలో బీయస్సీ మొదటి సంవత్సరంలో (1959-60) ఉండగా జరిగిన ఓ సంఘటన....

సాధారణంగా టీనేజిలో అబ్బాయిలకి అమ్మాయిలంటే ఆకర్షణ మొదలవడం సహజం. టీనేజిలోనే అమ్మాయిల్ని అబ్బాయిలకి దూరంగా ఉండేలా ఆంక్షలు విధించే మన సంప్రదాయంవల్ల ఆ ఆకర్షణకు కుతూహలం కూడా జత పడుతుంది. అప్పట్లో ఆడపిల్లలకి చదువు కంటే పెళ్లి ముఖ్యం. చదివే చదువు కూడా పెళ్లికోసమే అన్నట్లుండేది. అందువల్ల కాలేజిలో చదివే ఆడపిల్లల సంఖ్య తక్కువ. అబ్బాయిలూ అమ్మాయిలూ కలిసి మాట్లాడుకోవడమూ తక్కువే. మాట్లాడుకుంటే అదో పెద్ద విశేషం.

ఒంటరిగా కనబడ్డ అమ్మాయిని వ్యాఖ్యలతో వేధించడాన్ని, ఘనతగా ప్రచారం చేసుకునే అబ్బాయిలు కొందరుండడం విద్యాలయాల్లో మామూలే. వారికి వందిమాగధులుండడమూ మామూలే. కిమ్మనకుండా వాళ్ల అల్లరిని భరించడం అమ్మాయిలకూ మామూలే.

మా కాలేజిలోనూ అమ్మాయిల్ని ఏడ్పించడమే ధ్యేయంగా కొందరున్నారు. వాళ్లకి సమాజంలో దుష్టశక్తుల అండ, మద్దతు కూడా ఉంది. అందుకని టీచర్లు కూడా వాళ్ల జోలికి వెళ్లడానికి వెనుకాడేవారు. దుష్టులకు దూరంగా ఉండాలన్న సూత్రం తప్ప అమ్మాయిలకి వారినుంచి తప్పించుకునేందుకు వేరే మార్గం లేదు.

శ్రుతి మించకపోవడంవల్ల, అలాంటివన్నీ కూడా మామూలుగా చెలామణీ ఐపోతున్నాయి.

కానీ ఒకసారి ఆ అల్లరి శ్రుతి మించి రాగాన పడింది.

ఓసారి సైన్సు బ్లాకు కార్నర్లో మేడమెట్ల దగ్గర పియ్యూసీ చదివే ఓ అందమైన అమ్మాయి- ఇద్దరు అల్లరి కుర్రాళ్లకి ఒంటరిగా కనబడింది. వాళ్లకి బుద్ధి వక్రించింది. వెంటనే ఒకడామెకి వెనుక నిలబడ్డాడు. రెండోవాడు ముందుకెళ్లి ఆమె దారికి అడ్డంగా నిలబడి చేతులు అడ్డంగా చాచాడు. ఆమె వెనక్కి తిరిగితే, అదే పోజులో రెండోవాడున్నాడు.

మేకపోతు గాంభీర్యంతో, 'తప్పుకోండి' అని అరిచిందామె.

అంతే, ఒకడు ఆమె భుజంమీద చెయ్యేశాడు.

ఆమెకు వేరే దారి తోచక కెవ్వుమని కేకెట్టింది.

ఆ కేక కొందరు విన్నారు. అటు వెళ్లబోయి ఆ కుర్రాళ్లని చూసి భయపడి వెనక్కి తిరిగారు. కానీ అక్కడేదో జరుగకూడనిది జరుగ నున్నదని క్షణాలమీద సైన్సుబ్లాకంతా గుప్పుమనిపించారు.

అది పవిత్రమైన కాలేజి. సమయం పట్టపగలు. ఆమె ఓ మధ్యతరగతి అమ్మాయి. వాళ్లు సంస్కారం తెలియని కుర్రాళ్లు.

నిండుసభలో ద్రౌపదికి అవమానం జరగబోతుంటే, అన్యాయంకంటే నియమాలకే ప్రాధాన్యమిచ్చి అసహాయతను ప్రకటించి వాపోయిన కురు గురువృద్ధులున్న మహాభారతం మనది. అప్పుడామెని రక్షించడానికి అవతారపురుషుడైన శ్రీకృష్ణుడు పూనుకోవాల్సి వచ్చింది.

ఇప్పుడా కృష్ణుడి పాత్రని మా తెలుగు లెక్చరర్ చెరుకుమిల్లి జమదగ్నిశర్మ పోషించాడు. ఆయన నల్లనివాడే కానీ, పద్మనయనాలు లేవు. వేషభాషల్లో తెలుగుతనం ఉట్టిపడుతూండడంవల్ల, ప్రత్యేకమైన గౌరవానికీ, గుర్తింపుకీ నోచుకోనివాడు.

ఆయన అప్పుడు సైన్సు బ్లాకులోనే ఉన్నాడు. విషయం తెలియగానే కింకర్తవ్యం అని చర్చలకు దిగలేదు. 'ఎవడ్రా వాడు?' అంటూ సింహనాదం చేసి తన వయసుకు తగని వేగంతో పరుగు తీసి ఘటనా స్థలాన్ని చేరాడు.

అప్పుడక్కడ 'కుప్పించి ఎగసిన కుండలంబుల కాంతి'తో ఆ కుర్రాళ్లకు కళ్లు బైర్లు కమ్మాయి. 'కరికి లంఘించు సింహంబు కరణి మెఱసి, నేడు వీరిని జంపుదు నిన్ను గాతు' అన్నట్లు ఆ అమ్మాయికి ఒక చేత్తో అభయమిస్తూనే రెండో చేత్తో ఆ కుర్రాళ్ల చెంపలపై మెరుపుదాడి చేసి, వాళ్లని భయభ్రాంతుల్ని చేశాడు.

ఎంత తప్పు చేసినా కాలేజి కుర్రాళ్ల జోలికి వెళ్లడమంటే అగ్నికుండంలో దూకడమే. ఆ పని అదీ ఓ టీచరు, అదీ ఓ తెలుగు టీచరు చెయ్యడాన్ని 'సాహసమా, వట్టి సాహసమా?' అనుకోవాల్సిందే.

ఆ తర్వాత చాలామంది ఆ అమ్మాయికి తప్పిన అవమానం గురించి కాక, జమదగ్ని మేస్టారికి ఏమౌతుందోనని కలవరపడ్డారు. కానీ జరిగిందేమిటంటే– ఆతర్వాతనుంచి జమదగ్ని మేస్టారు కనబడితే చాలు– కుర్రాళ్లు దూరంనుంచే చేతులు జోడించి పక్కకు తప్పుకునేవారు. 'తప్పు చేస్తే చెయ్యండి. కానీ దగ్గర్లో తెలుగు మేస్టారున్నారేమో చూసుకోండి' అన్నది నానుడిగా విద్యార్థుల్లో ప్రబలమై అబలలకు వరమైంది.

భాషని ప్రేమించడం వేరు. భాషనే ప్రేమించడం వేరు. అదీ నాటి తెలుగు టీచర్ల వ్యక్తిత్వబలం.

ఇప్పుడు తెలుగు టీచర్లలో అలాంటివాళ్లున్నారో లేరో తెలియదు కానీ– నేటి మన కవులు, పండితులు, ప్రవచనకారులు ఆ కోవకు చెందినవారేననిపిస్తుంది.

ఇప్పుడు మమ్మల్ని చూసి, 'అనుకున్నాను. మీరు తెలుగువాళ్లేనని?' అన్న వ్యక్తి తెలుగు ఉచ్చారణ– నాకు నాటి తెలుగు టీచర్లని స్ఫురణకు తెచ్చి, మనసుని పులకరింపజేసింది.

అక్కడే ఆగి కాస్త పక్కకు వెళ్లి పరస్పరం పరిచయాలు చేసుకున్నాం.

అతడి పేరు శ్రీధరబాబు. వయసు నలభై పైనే కానీ ఇంకా పెళ్లి కాలేదు.

తెలుగులో పిహెచ్‌డి చేశాడు. వెంకటేశ్వరా యూనివర్సిటీలో తెలుగు డిపార్టుమెంట్లో రీడరు.

తను కవి, రచయిత కూడా. తను వ్రాసిన ఉపనిషత్కథలు పుస్తకాన్ని ఎమెస్కో పాకెట్ బుక్స్ వారు ప్రచురించారు.

నేను సైంటిస్టుననీ, శ్రీమతి గృహిణి అనీ చెప్పాను. రచయితలమని చెప్పలేదు.

“తెలిసినవారు నన్ను కవిబాబు అంటారు. మీరూ ఆ తెలిసినవాళ్ల జాబితాలో చేరొచ్చు” అన్నాడతడు.

నా అభిప్రాయంలో రచయితలు వేరు, కవులు వేరు. రచయితల ఆలోచనలు వాస్తవాల చుట్టూ తిరుగుతూ అవగాహనకు ప్రయత్నిస్తాయి. కవుల ఆలోచనల్లో– వాస్తవం కూడా భావుకతను నింపుకుని ఊహాప్రపంచంలో నడయాడుతుంది. అందువల్ల కవులు రచయితల్లా కాక, విభిన్నంగా, విలక్షణంగా ఉంటారు. వారి విశిష్టత అర్థం కానివారికి వివాదాస్పదులో, పరిహాసాస్పదులో ఔతారు.

నాకు రచనావ్యాసంగంలో ఉన్నవారితో వ్యక్తిగత పరిచయాలు అంతగా లేవు. కవులతో ఐతే బొత్తిగా లేవు.

“బెర్లిన్లో ఒక తెలుగు కవి మాట వినే అదృష్టం కల్పించారు. థాంక్స్” అన్నాను.

అతడు వెంటనే, “మీరు థాంక్సు చెప్పారు. బాగుంది. మరి మీకు థాంక్సు చెప్పే అవకాశం నాకివ్వరా?” అన్నాడు.

“మీరు కవి. భాషమీద పట్టున్న పండితులు. మేం మామూలు మనుషులం. మీచేత థాంక్సు చెప్పించుకునేటంత భాషాప్రావీణ్యం మాకు లేదు” అన్నాను.

అతడు నవ్వి, “దూరాన్నుంచి చూసినా, తెలుగుతనం ఉట్టిపడే కుటుంబం మీది. మీలాంటివాళ్ల ఇంటికొచ్చి, ఆతిథ్యం స్వీకరించి థాంక్సు చెప్పడం నాకిష్టం. అవకాశం మీరివ్వాలంతే! మీ ఇంటికెప్పుడొచ్చేది?” అన్నాడు.

తెల్లబోయాను. ఇంటికొస్తానని ఇంత సూటిగా, ఇంకా చెప్పాలంటే పచ్చిగా చెప్పేవారు నాకు బెర్లిన్లో తగుల్తారని అనుకోలేదు.

తటపటాయిస్తే బాగుండదు కదా, “అంతకన్నానా, రేపే రండి!” అన్నాను.

శ్రీమతి చటుక్కున, “రేపు మీకు ఆఫీసుంది కదా!” అంది. దానికి నేనేదో అనేలోగా, “దాందేముందీ, సాయంత్రమొస్తాను. ఐదింటికల్లా మీరు ఆఫీసునించొచ్చేస్తారుగా. నేను ఆరింటికొస్తాను. మీకు వీలేగా!” అన్నాడు కవిబాబు.

తలాడించాను. అప్పటికి విడిపోయాం.

ఇంటికెళ్లేక, “అతణ్ణి మరీ రేపే రమ్మని చెప్పేశారేమిటి?” అని శ్రీమతి నన్ను దెబ్బలాడింది.

"గీతలో కృషుడేమన్నాడు– 'చేసెడి వాడను నేనే, చేయించెడివాడను నేనే' అనేగా. ఇక్కడ మన కవిబాబు కృష్ణుడు, నేను పార్థుడు. పిలిచింది నేను కాదు. అతడు పిలిపించుకున్నాడంతే!" అన్నాను.

శ్రీమతి మాట్లాడలేదు. కవిబాబు తనకి తానుగా మా ఇంటికొస్తాననడం ఎబ్బెట్టుగా అనిపించిందేమోనని అనుమానమొచ్చి, "ల్యూనబర్గులో ఉండగా, ఇంట్లో వంట సదుపాయం లేక, మన తిండి కోసం ఎంత మొహం వాచిపోయానో ఉత్తరాల్లో నీకు వ్రాశాను. అడగడానికి నాకు మొహమాటమని తెలిసి, అక్కడున్నవాళ్లలో వంట సదుపాయమున్న భారతీయులందరూ నన్ను బలవంతపెట్టి మరీ వాళ్లిళ్లకి పిలిచి విందు చేసేవారు. వద్దొద్దని పైకి అన్నప్పటికీ మనసులో వాళ్ల పిలుపులకోసం ఎదురుచూసేవాణ్ణి. బహుశా కవిబాబుదీ అదే పరిస్థితేమో! పాపం, నోరు విడిచి మరీ అడిగేడని జాలేసి, రేపే రమ్మన్నాను. ఐనా ఎలాగూ ఎప్పుడో ఓసారి పిలుస్తాంగా, అది రేపైతేనేం..." అని ఏదో అనబోతుండగా....

"అందుకే, మంచి తెలుగు వంట ఏదైనా చేసిపెట్టాలనుకున్నా. ప్రస్తుతానికి ఇంట్లో ఉప్మా నూక తప్ప ఇంకేం లేదు..." అంది శ్రీమతి.

తెలుగు ఆడవాళ్లంతా డొక్కా సీతమ్మ అంశను ఎంతో కొంత తమలో ఇముడ్చుకున్న అన్నపూర్ణలు. తను కవిబాబు రాకకంటే ఎక్కువగా, తన ఆతిథ్యం అతడికిచ్చే సంతృప్తి గురించి అతడివైపునించి ఆలోచిస్తోంది.

"దాందేముంది? టమేటాలు కూడా ఉన్నాయిగా, టమేటా బాత్ చెయ్యి. సెనగపప్పు చట్నీ నీ స్పెషాలిటీ" అన్నాను.

"అదికాదండీ! ఆతిథ్యం విషయంలో అతడికేవో అంచనాలున్నట్లుంది. వాటిని అందుకోగలమా అని నా అనుమానం" అంది శ్రీమతి.

"మనమేమన్నా ఇండియాలో ఉన్నామా? ఇది జర్మనీ. ఇక్కడ తెలుగు వంటకం దొరకడమే ఓ అదృష్టం. మన వల్లనైంది మనం చేద్దాం" అనేసి ఆ సంభాషణకి అంతటితో ఫుల్‌స్టాప్ పెట్టాను.

మర్నాడు సాయంత్రం కరెక్టుగా ఆరింటికి కవిబాబు మా ఇంటి కాలింగ్‌బెల్ మ్రోగించాడు. నేను తలుపు తియ్యగానే, "సారీ అండీ, ఎంత ప్రయత్నించినా పంక్చ్యువాలిటీలో భారతీయత పాటించలేకపోయాను. జర్మనీ నీళ్ల ప్రభావం అనుకోవాలి" అన్నాడు.

బాగా ప్రిపేరైన డైలాగు అప్పగించినట్లుంది. సరదాగా మాట్లాడాలన్న తాపత్రయమేమో అనుకుంటూ, "వీళ్లు బీరే కానీ నీళ్లు తాగరుగా, మరి మీపై ప్రభావం చూపినవేమిటో?" అన్నాను. మనసులో మాత్రం నేనూ అతడిలాగే తాపత్రయపడ్డం లేదు కదా అని శంక!

"వాళ్లిళ్లకెడితే బీరు వదులుకోలేం. మనవాళ్ల ఇళ్లకెళ్లినప్పుడు బీరు అడగలేం. అందుకని రెండలవాట్లూ కొనసాగిస్తున్నా" అన్నాడతడు. ఈ మాట ప్రిపేరవకుండానే అన్నాడు కాబట్టి, మొదటి అభిప్రాయాన్ని కాస్త

సవరించుకోవాలని అనుకున్నాను. కానీ, మాటల్లో తరచుగా వంటకాలో, పానీయాలో చోటు చేసుకోవడాన్నీ మనసు పసి కట్టింది.

ఇద్దరం లోపలకెళ్లాం. పది నిముషాలు అవీ ఇవీ మాట్లాడుకున్నాక నాకూ, అతడికీ ప్లేట్లలో టమేటాబాత్ తెచ్చిచ్చింది శ్రీమతి.

"మరి మీరూ, పిల్లలో?" అన్నాడతడు వెంటనే.

"వాళ్లకి సరిగ్గా తినడం రాదు. కిందామీదా పోసుకుంటారని మేమే నోట్లో పెడతాం. వాళ్లూ, తనూ– అదిగో, అక్కడ మంచానికి దగ్గర్లో కూర్చుంటారు. మనమిక్కడ కబుర్లు చెప్పుకుంటూ ఫలహారం కానిద్దాం" అన్నాను.

పాపకి పౌరుషమొచ్చినట్లుంది, "కిందామీదా పోసుకునేది తమ్ముడు. నేను కాదు" అని అభ్యంతరపెట్టింది. దాంతో తమకేదో అవమానం జరిగినట్లు బాబుకీ అనిపించినట్లుంది, "తిందామీదా నేనూ పోచుకోను" అన్నాడు.

నిజానికి మా పిల్లలిద్దరూ కూడా మాతోపాటు మా పక్కనే కూర్చుని భోంచేస్తారు. కింద మెతుకు కూడా పడదు. ఎప్పుడైనా నేలమీద కార్పెటుపైన చిన్న మెతుకు కనబడితే, అది నాదేనని వాళ్లు తేల్చేస్తారు. శ్రీమతి వాళ్లకు వత్తాసు. అబద్ధమెందుకూ, వాళ్ల మాటల్లో కొంత నిజమూ లేకపోలేదు.

కవిబాబు నన్నదోలా చూసి, "ఎవరింటికెళ్లినా, వాళ్లలో ఒకరిగా కలిసిపోవాలి. లేకుంటే వాళ్లకి బోరు కొట్టి మళ్లీ రమ్మనరు. నేనైతే ఎవరింటికెళ్లినా ముందు పిల్లలతో కలిసిపోతాను. ఎందుకంటే అతిథుల రాకతో బోరు కొట్టేది వాళ్లకే మరి!" అని సైగ చేసి పిల్లల్ని పిలిచాడు. వాళ్లు కాస్త మొహమాటంగా తనని సమీపించగానే, "మనం కలిసి టిఫిన్ చేద్దామా?" అన్నాడు.

అనుకోకుండా లభించిన ప్రాధాన్యత వాళ్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. సరేనన్నారు. ఆ వెంటనే కవిబాబు స్పూన్లు కావాలన్నాడు. శ్రీమతి మా ఇద్దరికీ రెండు చెంచాలు తెచ్చిస్తే, పిల్లలకీ కావాలన్నాడు.

"వాళ్లకి చెంచాలు వాడ్డం రాదు" అనేసి పాప మొహం చూసి నాలిక్కరుచుకున్నాను. అదప్పుడే నన్ను కోపంగా చూస్తోంది.

"తినేటప్పుడు మధ్యలో నీళ్లకి బదులు బీరు తాగకపోయినా ఫరవాలేదు. కానీ తినడానికి చెంచాలు వాడడంలో మనం ఇక్కడివాళ్లని అనుసరించాలి. అది చాలా మంచి పద్ధతి. చేతులు ఎంగిలవవు. చూడ్డానికీ బాగుంటుంది" అని పిల్లలవైపు తిరిగి, "చెంచాతో తినడం ఎంత సులువో, ఎంత బాగుంటుందో మీకు నేనిప్పుడు చూపిస్తాను" అన్నాడు.

అప్పటికే తనకి చెంచాతో తినడం వచ్చని పాపకి నమ్మకం. కానీ అతడేం చూపిస్తాడోనన్న కుతూహలం ఆ అహాన్ని అణిచేయగా, "దారా" అంది తమ్ముడితో.

పాప, బాబు ఉప్మా ప్లేట్లు పట్టుకుని అతడికి చెరో పక్కా చేరారు.

కవిబాబు రెండు చేతుల్లోకీ రెండు చెంచాలు తీసుకున్నాడు. వాళ్ల ప్లేట్లలో పెట్టి కొద్దిగా ఫలహారం చెంచాల్లోకి తీసి, "ఇలా తీసుకోవాలి" అన్నాడు. తర్వాత వాళ్ల నోళ్లలో పెడుతూ, "ఇలా తినాలి" అన్నాడు.

మేము కూడా అతడి చేతుల కదలికనే కుతూహలంగా చూస్తున్నాం. ఐతే చెంచాలు పిల్లల నోళ్లలోకి బదులు ముక్కుల్లోకీ, బుగ్గలమీదకీ, ఇంకా కళ్లమీదకీ కూడా వెళ్లిపోతున్నాయి. పిల్లలు చెంచాల్ని నోళ్లతో అందుకుందుకు మొహాల్ని పైకీ కిందకీ పక్కలకీ కదుపుతూ అవస్థ పడుతున్నారు.

అలా ఎందుకు జరుగుతోందా అని కవిబాబుని చూస్తే అతడు పిల్లల మొహాలకేసి చూడ్డం లేదు. మా మొహాలే చూస్తున్నాడు. అతడి కళ్లు తన నైపుణ్యానికి మానుంచి మెప్పుని కోరుతున్నాయి.

మనస్తత్వాలే కథాంశాలుగా రచనావ్యాసంగానికి దిగినవాణ్ణి. పిల్లలకు నేర్పడంకంటే, మా మెప్పుకే అతడి ప్రాధాన్యమని గ్రహించినవాడనై, "పిల్లలూ, అంకుల్ భలే చెప్పారుగా, ఇక మీకు మీరుగా చెంచాలు వాడి టిఫిన్ తినెయ్యండి" అని వాళ్ల మొహాల్ని రక్షించాను.

కవిబాబు చెంచాల్ని పిల్లల ప్లేట్లలో వదిలాడు. వాళ్లా ప్లేట్లు తీసుకుని అక్కణ్ణించి అతడికందనంత దూరంగా వెళ్లిపోయారు.

నేను, శ్రీమతి, కవిబాబు టేబుల్ దగ్గర కూర్చున్నాం. నాటికి పిల్లలతో కలిసిపోయే విషయంలో తన డిమాన్‌స్ట్రేషన్ ఐపోవడం వల్లనేమో, కవిబాబు పిల్లల్ని టేబుల్ వద్దకు రమ్మని నొక్కించలేదు.

అప్పుడతడు ఫలహారాన్ని పరీక్షగా చూసి, "అందంగా కనబడాలని ఎర్రని టమేటాల్ని అలంకరించుకుంది ఉప్మా. కానీ ఆ అందాన్ని మనం కంటితో కాదు, నోటితో అస్వాదిస్తామని దానికి తెలియదు పాపం!" అన్నాడు.

అతడిలో కవి ఉన్నాడు. కవి ఎక్కడున్నా అనుక్షణం స్పందిస్తూనే ఉంటాడు.

నేను వెంటనే, "మీరు కవిత్వంతో ఫలహారాలకి కూడా ప్రాణం పోస్తే– శాకాహారులం, మనకి తినడానికేముండవు" అన్నాను.

అతడు ఫలహారం ఓ స్పూను రుచి చూసి, "ఒకప్పుడు నేనూ మీకులాగే ఆలోచించేవాణ్ణి తెలుసా?" అన్నాడు.

"నాకులా అంటే?" అన్నాను అర్థం కాక.

"టమేటాబాత్ చాలా బాగుంది. ఇంకో రెండు చెంచాలు రుచి చూసి అప్పుడు చెబుతాను" అన్నాడు. తర్వాత ఫలహారం సేవిస్తూ, అతడు చెప్పినదిది.

కవిబాబు శాఖాహారి. శ్రీవైష్ణవుడినని నిస్సంకోచంగా చెబుతాడు.

అతడి మిత్రుల్లో మాంసాహారులున్నారు. కలిసి భోంచేసేటప్పుడు– మాంసాహారాన్ని చూసినప్పుడల్లా, అతడికి ఆహారానికి బదులు ఆ ప్రాణి గుర్తుకొచ్చేది. దాన్ని వర్ణిస్తూ ఓ కవిత చెప్పేవాడు.

అలా ఒకటి రెండుసార్లు జరిగేక, అతడి మిత్రుడొకడు, "నీ ప్లేట్లో వంకాయ కూర చూస్తుంటే- ఈ పద్యం గుర్తొస్తోంది" అని ఘంటసాల పుష్పవిలాపం తరహాలో కవితలు చదివేట్ట. వాటినిప్పుడు కవిబాబు చదివి వినిపించాడుః

'నేనొక వంగమొక్క కడ నిల్చి, చివాలున కొమ్మవంచి, గోరానెడు నంతలోన చిరుపిందెలు జాలిగ నోళ్లు విప్పి మా ప్రాణము తీతువా యనుచు బావురుమన్నవి, నా మానసమందెదో తళుకుమన్నది వంగవిలాపకావ్యమై'

'కత్తిపీటని వాడి నరికి నరికి, కారాన్ని తనువంత పూసి పూసి, మరుగు నూనెలోన ముంచి ముంచి, వేపి తిందురు ముచ్చట మీరు మమ్ము...."

కవిబాబు గొంతు గంభీరమైనది. లోతైనది. భావప్రకటనలో ఆరితేరినది. అతడి నోట ఆ కవితలు వింటుంటే- వంకాయలు సజీవంగా మాముందు నిలబడి తమ వేదన చెప్పుకున్నట్లే అనిపించింది. నేను, శ్రీమతి కూడా ఆ కవితలు విని చలించిపోయాం. జీవితంలో మళ్లీ వంకాయ కూర తినగలమా అనిపించింది నాకు.

కవిబాబుకి మా పరిస్థితి అర్థమైనట్లుంది, "అప్పటికి అర్థమైంది నాకు. ఆహారం నిర్జీవమే కానీ, జీవి మనుగడకి అత్యవసరం. మనుగడకి ఎవరి ఆహారపు అలవాట్లు వాళ్లవి. మాంసాహారంలో హింస ఉన్నదన్న భావననుంచి తప్పించుకుందుకు, నేను శాకాహారాన్ని చూసినప్పుడల్లా వంగవిలాప గేయాల్ని గుర్తు చేసుకుంటాను. నా ఎదుటనున్న ఫలహారంలో జీవాన్ని నింపుతాను" అన్నాడు కవిబాబు.

శ్రీమతికీ భావన నచ్చలేదు, "అందువల్ల, తినే ఆహారాన్ని కూడా ఎంజాయ్ చెయ్యలేకపోవడం తప్ప ఏమిటి ప్రయోజనం?" అంది.

"మీవారు సైంటిస్టు. మనం పీల్చే గాలిలో, తాగే నీళ్లలో కోట్లాది సూక్ష్మజీవులుంటాయని తెలుసు కదా! మనం వేసే ప్రతి అడుగుకిందా కంటికి కనిపించని జీవాలెన్నో మరణిస్తాయని తెలుసు కదా! అలాగని మనం అన్నీ మానుకోగలమా? పక్వాహారాన్ని ఆహారంగానే స్వీకరించి ఆనందించడం నేర్చుకోవడానికి, వంగవిలాపం సహకరిస్తుంది" అన్నాడతడు.

ఇప్పటికే కులం, మతం, భాష, రంగు వగైరా భేదాలతో మనిషిని మనిషినుంచి వేరు చేస్తున్నాం. మనుగడకి అత్యావశ్యకమైన ఆహారం కూడా అలాంటి అంశంలో జతపడకుండా- ఈ భావన సహకరిస్తుందని అతడి అభిప్రాయం.

నేనతణ్ణి మెచ్చుకున్నాను. శ్రీమతి మాత్రం, "నాకు మాంసాహారులంటే చిన్నచూపు లేదు, నిరసనభావం లేదు. మేముండే ఒరిస్సాలో బ్రాహ్మణులూ మాంసాహారులే. మేమంతా కలిసి విందులు చేసుకుంటాం. మరి నాకూ ఇలాంటి భావన అవసరమా?" అంది.

ఆ మాట తర్వాత ఫలహారసేవనం క్షణాలమీద ముగిసింది. శ్రీమతి వంటింట్లోకి వెళ్లి అతడికోసం కాఫీ కలిపి తెచ్చింది.

అతడు కప్పందుకుని అది కాఫీ అని గ్రహించి, "ఇదేమిటి- కాఫీ తెచ్చారు?" అన్నాడు.

"మీరూ కాఫీ తాగరా?" అన్నాను ఆశ్చర్యంగా.

"కాఫీ తాగకేం, నిక్షేపంలా తాగుతాను. కానీ అప్పుడేనా?" అన్నాడతడు.

గొంతు కటువుగా ధ్వనించి ఆశ్చర్యపడి, అతడి మొహం చూస్తే కళ్లలో ఎరుపు జీర.

ఎందుకో నాకతడప్పుడు నిగ్రహించుకుందుకు ప్రయత్నిస్తున్న దుర్వాసుడిలా కనిపించాడు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

COMMENTS